



ఇచ్ఛాపురం : ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు





శ్రీకాకుళం: కోదండరామాలయంలో పూజలు.. స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో ఏకాదశి

శ్రీకాకుళం కల్చరల్/ ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి పర్వదినం వేళ.. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంగళవారం వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల ఆలయంలో వజ్రకవచ దర్శనం పూజలు నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో స్వామి దర్శనానికి భక్తులు బారులుదీరారు. ఇచ్ఛాపురంలో జగన్నాథస్వామి, సత్యన్నారాయణస్వామి, వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగన్నాథ ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా తులసి మాలలతో అలంకరించి పూజలు చేశారు.



'విప్'గా అశోక్

- టీడీపీ కంచుకోట ఇచ్ఛాపురానికి లభించిన గౌరవం

శ్రీకాకుళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను విప్‌గా ప్రభుత్వం నియమించింది. 2014లో టీడీపీ తరపున తొలిసారిగా ఇచ్ఛాపురం నుంచి పోటీ చేసి బెందాళం అశోక్ గెలుపొందారు. 2019లో జగన్ హవాలోనూ ఈ నియోజకవర్గ ప్రజలు టీడీపీ వైపే నిలిచి అశోక్‌కు పట్టం కట్టారు. తాజాగా ఈసారి (2024) ఎన్నికల్లో కూడా అశోక్‌ను మూడోసారి గెలిపించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా గుర్తింపు సాధించింది. పదిసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. తొమ్మిదిసార్లు టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. ప్రజలకు టీడీపీపై మక్కువ ఉన్న ఈ నియోజకవర్గానికి గౌరవం కల్పిస్తూ.. ఎమ్మెల్యే అశోక్‌కు అసెంబ్లీ విప్ పదవిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ నెల 1న ఈ నియోజకవర్గంలో దీపం-2 పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఆ సమయంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో ఎమ్మెల్యే అశోక్ పనితీరు సీఎం మెచ్చుకున్నారు. ఈక్రమంలో విప్ పదవి వరించింది.

నమ్మకాన్ని వమ్ము చేయను

టీడీపీ కోసం నిరంతరం శ్రమించాం. మా కష్టానికి గుర్తింపు లభించింది. సీఎం చంద్రబాబునాయుడు అపారమైన నమ్మకంతో 'విప్' పదవి ఇచ్చారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయను. ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు జిల్లా అభివృద్ధిలో భాగస్వామిని అవుతా.

- బెందాళం అశోక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

- **ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవికి కూడా..**



వైసీపీ ప్రభుత్వంలో మొదటి తిరుగుబాటు బావుటా ఎగరవేసింది 'ఉత్తరాంధ్ర పట్టభద్రులు' మాత్రమే. రెండేళ్ల కిందట ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో నిలిచిన వేపాడ చిరంజీవిని పట్టభద్రులు ఊహించని మెజార్టీతో గెలిపించారు. దీంతో తమపై వ్యతిరేకత ప్రజల్లో ఎంత ఉందో వైసీపీ అధిష్టానానికి సంకేతం వెల్లడైంది. చిరంజీవి ఉన్నత విద్యావంతుడు.. పైగా ఉత్తరాంధ్రలో నిరుద్యోగుల కోసం సొంతంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆయనకు శాసనమండలి విప్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది.



నరసన్నపేటలో సర్వీసు రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు

ధాన్యం.. దైన్యం

- రైతుల కష్టం.. దళారుల పాలు
- బస్తాకు 5కేజీల వరకు అదనంగా దోపిడీ
- కొనుగోలు కేంద్రాలపై స్పష్టత లేక ఇక్కట్లు
- నిల్వ ఉంచలేక అవస్థలు

నరసన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు వారాల నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని ఇంటికి తీసుకువస్తున్నారు. కాగా.. ధాన్యం కొనుగోలుపై అధికారులు, నాయకులు ప్రకటనలే తప్ప.. స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయకపోవడంతో చాలామంది రైతులను దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు పచ్చి ధాన్యం, తరుగు పేరిట మద్దతు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.67 లక్షల ఎకరాల్లో 2,94,175 మంది రైతులు వరి సాగు చేశారు. సుమారు 8.62 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వరికోతలు సాగుతున్నాయి. తేమశాతం లేకుండా ఉండేందుకు రైతులు రహదారుల పక్కన ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. నరసన్నపేట, దేవాది, కోమర్తి, తామరాపల్లి, జమ్ము, రావాడపేట తదితర ప్రాంతాల్లో ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధర క్వింటా ధాన్యానికి గ్రేడ్-1కు రూ.2,320, గ్రేడ్-2కు రూ.2,300 ప్రకటించింది. ఈ మేరకు 80 కేజీల బస్తాకు రూ.1,840 చెల్లించాల్సి ఉంది. కానీ, దళారీలు మాత్రం (మిగతా 6వ పేజీలో..)

- జలుమూరు గ్రామానికి చెందిన జలుమూరు అప్పారావు.. ఈ ఏడాది కౌలు పద్ధతిలో వరి సాగు చేశారు. జూన్‌లో ఎదలు వేయగా.. గత నెలాఖరున పంట కోత, నూర్పులు చేపట్టారు. జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో.. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన దళారీకి పచ్చి ధాన్యం బస్తా(85 కేజీలు) రూ.1,450 చొప్పున విక్రయించారు. కాగా పచ్చిధాన్యం పేరుతో బస్తాకు 5 కేజీలు అదనంగా తీసుకున్నారని.. రూ.400 వరకు తక్కువ డబ్బులు చెల్లించారని అప్పారావు వాపోతున్నారు.
- నరసన్నపేట మండలం బొడ్డవలసకు చెందిన నేతింటి అప్పలస్వామి అనే రైతు.. పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి.. ఇటీవల దళారీలకు విక్రయించారు. మద్దతు ధర రూ.1,840 కాగా, దళారీ రూ.1500కు కొనుగోలు చేశారు. దీనిపై ఆ రైతు ప్రశ్నించగా.. బస్తాకు రూ.100వరకు రవాణా ఖర్చులు ఉంటాయని, ధాన్యంలో రద్దు కూడా వస్తాయని చెబుతూ దళారీలు బదులిచ్చారు. చేసేది లేక వారు చెప్పిన ధరకూ ధాన్యాన్ని విక్రయించారు.

అల్పపీడనంతో ఆందోళన..

సరుబుజ్జిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సరుబుజ్జిలి మండలంలో సుమారు 15వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రొట్టవలస, రావివలస, కొండవలస, షలంత్రి, కొత్తకోట, సరుబుజ్జిలి, చిగురువలస, డకరవలస, పాలవలస, పురుషోత్తపురం తదితర గ్రామాల్లో రైతులు వరి కోతలు పూర్తిచేశారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా పచ్చిధాన్యం విక్రయానికి సిద్ధమయ్యారు. కాగా.. కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 17 తర్వాతే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని సచివాలయ అధికారులు చెబుతుండడంతో.. అంతవరకూ వాటిని ఎలా భద్రపరచాలో తెలియక సతమతమవుతున్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా చేపట్టి.. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



మునగవలసలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

ఆఫ్రికా వన్యప్రాణులను తరలిస్తూ..

- పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర ముఠా
- ఒడిశా నుంచి కర్ణాటకకు అక్రమ రవాణా
- పాములు, తాబేళ్లు, అడవిపిల్లి స్వాధీనం
- విశాఖపట్నంలో జంతు ప్రదర్శన శాలకు తరలింపు





విదేశీ వన్యప్రాణులు తరలిస్తూ పట్టుబడిన కర్ణాటక వాసులు



పలాస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా దేశానికి చెందిన వన్యప్రాణుల ను ఒడిశా నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయింది. సోమవారం రాత్రి ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు సోదాలు నిర్వహించగా కర్ణాటకు చెందిన ముగ్గురు వ్యక్తులు పాములు, తాబేళ్లు, అడవి పిల్లిని తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి మొత్తం 21 వివిధ వన్యప్రాణులను స్వాధీనం చేసుకుని విశాఖపట్నంలో జంతు ప్రదర్శన శాలకు తరలించారు. స్మగ్లర్లను ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరిచారు. దీనికి సంబంధించి అటవీఅధికారి ఏఎంకే నాయుడు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

- కర్ణాటకు చెందిన సయ్యద్‌లియాఖత్ ఉల్లా, ముజాయత్ అహ్మద్‌ఖాన్, విజయ్ కుమార్ ముఠా సభ్యులుగా ఏర్పడి విదేశీ వన్యప్రాణులను (జంతువులు, పక్షులు) ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ఆఫ్రికా దేశానికి చెందిన వివిధ రకాల కొండచిలువపిల్లలు 17, వందేళ్ల వయసు ఉండే తాబేలు, పదేళ్ల వయసు ఉండే రెండు చిన్న తాబేలు, ఏడాది వయసు ఉండే అడవి పిల్లిని తీసుకొచ్చి ఒడిశాలో ఓ బ్రోకర్‌కు విక్రయించాలనుకున్నారు. అయితే బేరసారాల్లో తేడా రావడంతో వాటిని మళ్లీ ఖరీదైన ఏసీ కారులో పెట్టి.. ఒడిశా మీదుగా కర్ణాటకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇచ్ఛాపురం చెక్ పోస్టు వద్ద కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు కారును తనిఖీ చేశారు. ఇనుపజాలీలో చిరుతపులి మాదిరిగా ఓ జంతువు కనిపించడంతో వారు ప్రశ్నించగా ఆఫ్రికా వన్యప్రాణుల అక్రమ రవాణా బండారం బయట పడింది. మొత్తం 21 జంతువుల విలువ రూ.20 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. అందులో రెండు అడుగుల పొడవు గల కొండ చిలువే బహిరంగ మార్కెట్‌లో రూ.లక్ష వరకూ పలుకుతుందని అధికారులు చెబుతున్నారు. పట్టుబడిన జంతువులన్నీ ఇంటిలో పెంచుకోదగినవేనని, జంతు ప్రేమికులు వీటిని అధిక ధరలకు కొనుగోలు చేస్తుంటారని తెలిపారు. ఆ ముగ్గురి ముఠాసభ్యులను మంగళవారం ఇచ్ఛాపురం కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన వన్యప్రాణులను విశాఖపట్నంలోని జంతు ప్రదర్శనశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారి ఏఎంకే నాయుడు తెలిపారు.
- గతంలో కూడా కాశీబుగ్గ అటవీశాఖ పరిధిలో అనేక (మిగతా 6వ పేజీలో...)

గంజాయి దొంగలు దొరికారు

- 563 కేజీల నిల్వలు స్వాధీనం
- ఒడిశా రాష్ట్ర హోంగార్డుతో సహా ఇద్దరు అరెస్టు
- బస్సులతోపాటు కంటైనర్లపై కూడా నిఘా
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల కిందట పోలీసుల తనిఖీలో నేపథ్యంలో గంజాయితో వాహనాన్ని వదిలేసి పరారైన దొంగలు ఎట్టకేలకు చిక్కారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు గంజాయి అక్రమ రవాణా చేయగా.. వారికి అక్కడి హోంగార్డు ఒకరు సహకరించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి.. వారి నుంచి 563 కేజీల గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు.

- గత నెల 24న మెళియాపుట్టి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఓ బొలెరో(ఓఆర్ 18ఏ5409) వాహనం ఆపకుండా వెళ్లిపోతూ.. మెళియాపుట్టి మండలం జాడుపల్లి వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. పోలీసులు అక్కడికి చేరుకోగా గుర్తుతెలియని వ్యక్తులు ఆ వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. పోలీసులు ఆ వాహనాన్ని తనిఖీ చేయగా.. 16 బస్తాలో 563.920 కేజీల (మిగతా 6వ పేజీలో..)



శ్రీకూర్మనాథుని సన్నిధిలో కొండవీటి జ్యోతిర్మయి

గార, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని కూర్మనాథుడ్ని.. టీటీడీ ఆస్థాన గాయని కొండవీటి జ్యోతిర్మయి మంగళవారం దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టత గురించి అర్చకులు కిషోర్‌బాబు ఆమెకు వివరించి స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

జీడి రైతుకు ఊతం

- పంటకు బీమా వర్తింపు
- ఎకరాకు రూ.1600 కడితే.. రూ.32 వేల పరిహారం
- జిల్లాలో ఐదు లక్షల కుటుంబాలకు మేలు

6లో



జీడి రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మద్దతు ధర పెంచడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే.. బాధితులకు బీమా పథకం కూడా వర్తింపజేయనుంది. రైతు వాటాగా ఎకరాకు రూ.1,600 చెల్లిస్తే.. రూ.32వేల వరకూ పరిహారం అందజేయనుంది. గత ఐదేళ్లలో పంటల బీమా పథకంలో జీడికి చోటులేక, ఆశించినస్థాయిలో గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తెప్పోత్సవానికి సిద్ధం చేసిన హంసనావ

నేడు ఆదిత్యుని తెప్పోత్సవం

6లో

కార్తీకమాసం.. క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని అరసవల్లిలో ఆదిత్యుడి తెప్పోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఉత్సవానికి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం హంసనావను సిద్ధం చేసి.. ఇంద్ర పుష్కరిణిలో ట్రయల్ రన్ నిర్వహించారు.

అద్భుత కళాఖండం

● సీసా లోపల కుర్చీ తయారీ

● తండ్రి గుర్తుగా 47 ఏళ్లుగా భద్రంగా దాచుకున్న కుమారుడు



నరసన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆయనొక శిల్పి.. తన కళా నైపుణ్యంతో చిన్న మూత గల సీసాలో ఇమిడిపోయేలా ఐదు సెంటీ మీటర్ల గల కుర్చీని తయారు చేశాడు. ఆయనే కింతాడ లక్ష్మీనారాయణ. పోలాకి మండలం మబుగాం గ్రామానికి చెందిన ఈ శిల్పి.. 1977 డిసెంబరు 27న ఒక సీసాలో ఇమిడిపోయేలా దాని మూత మార్గం ద్వారా చిన్నచిన్న కర్రలను పంపించి ఓ కుర్చీని రూపొందించాడు. దీనికి గాను అప్పట్లో పలువురు ప్రశంసలు పొందాడు. ఈ కళాఖండం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. తన తండ్రి తయారు చేసిన ఈ కళారూపాన్ని ఆయన గుర్తుగా భద్రపరిచినట్టు కుమారుడు కింతాడ నీలకంఠం తెలిపారు. తాము ఎంత ప్రయత్నించినా ఇలా తయారు చేయడం తమ వల్ల కావడం లేదని నీలకంఠం అన్నారు.

సీసాలో అమర్చిన కుర్చీ (ఇన్‌సెట్‌లో) శిల్పి లక్ష్మీనారాయణ (ఫైల్)

నేడు ఆదిత్యుని తెప్పోత్సవం

● వేలాదిగా తరలిరానున్న భక్తజనం

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అరసవల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి తెప్పోత్సవం బుధవారం జరగనుంది. పవిత్ర కార్తీకమాసం, క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని ఉషా, ఛాయా, పద్మినీ సమేత దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉత్సవమూర్తులను హంస వాహనంపై ఇంద్ర పుష్కరిణిలో ఊరేగించనున్నారు. అలాగే, మాడవీధుల్లో ఊరేగించి ఆలయ అనివెట్టి మండపంలో క్షీరాబ్ది వ్రతకల్పం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు స్వర్ణాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏడాదిలో రెండుసార్లు మాత్రమే స్వామివారిని ఇలా అలంకరిస్తారు. ఆదిత్యుని దర్శనానికి వేలాది మంది భక్తులు తరలిరానుండడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. తెప్పోత్సవం పురస్కరించుకొని ఆలయంతో పాటు పరిసరాలను రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సుమారు 50 వేల మంది భక్తులు రానున్నారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో వై.భద్రాజీ తెలిపారు. రాష్ట్రం నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి కూడా భక్తులు వస్తారని అన్నారు. భద్రతాపరంగా బీమా కల్పించిన వారికే హంస వాహనం లోనికి అనుమతిస్తామని, ఇతరులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం అగ్నిమాపకశాఖ, మత్స్యశాఖ, దేవస్థానం సిబ్బందితో కలసి ట్రయల్ రన్ నిర్వహించారు.



హంస వాహనంపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ధాన్యం.. దైన్యం

(ఐదో పేజీ తరువాయి)

85 కేజీల ధాన్యాన్ని తీసుకుని.. రూ.1,400 నుంచి రూ.1,500 మాత్రమే రైతులకు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారీలకు విక్రయించి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మారిన వాతావరణంతో అలజడి..

వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతుల్లో అలజడి రేగుతోంది. ఇటీవల తుఫాన్ ముప్పు తప్పగా.. రైతులు ముమ్మరంగా వరికోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టారు. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట మండలం కరగాం, రెడ్డికపేట, బొడ్డవలస, జమ్ము, జలుమూరు మండలం గొటివాడ, రామయ్యవలస, కామేశ్వరిపేట తదితర గ్రామాల్లో రోడ్లు మీద ఆరబెట్టిన పచ్చి ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవస్థలు పడుతున్నారు.

● ఆసక్తి చూపని మిల్లర్లు..

జిల్లాలో పచ్చి ధాన్యం మరపట్టే రైస్ మిల్లులు 250 పైగా ఉన్నాయి. సన్న రకాలు తప్ప.. ముదుగు రకాలు కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది.. నచ్చిన మిల్లుకు రైతులు ధాన్యం విక్రయించుకునేలా అవకాశం కల్పించింది. కానీ రైతులు ఇచ్చే ధాన్యాన్ని తీసుకునేం దుకు మిల్లర్లు మౌనం వహిస్తున్నారు. మీ మిల్లుకు ధాన్యాన్ని పంపిస్తామని రైతులు మిల్లర్లను అడగ్గా.. పౌరసరఫరాలశాఖ నుంచి తమకు ఇంకా మార్గదర్శకాలు రావడం లేదని చెబుతున్నారు. మిల్లర్ల నుంచి కనీస భరోసా లేకపోవడం.. మరోవైపు వాతావరణ పరిస్థితుల కారణంగా నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు దళారీలను ఆశ్రయించి ధాన్యం విక్రయిస్తున్నారు.

● 17 నుంచి కొనుగోళ్లు..

ఈనెల 17 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్టు ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో.. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పౌరసరఫరాలు, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 402 ఏజెన్సీల్లో అంటే పీఏసీఎస్, మార్క్‌ఫెడ్, రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చారు. కేంద్రాలను త్వరగా ప్రారంభించి.. ధాన్యం కొనుగోలుపై మార్గదర్శకాలు జారీచేయాలని రైతులు కోరుతున్నారు.

ఆఫ్రికా వన్యప్రాణులను తరలిస్తూ..

(ఐదో పేజీ తరువాయి)


అడవి జంతువులు రాష్ట్రాల సరిహద్దులు దాటిన సంఘటనలు ఉన్నాయి. అలుదులు, ఆఫ్రికా కోతులు పట్టుబడగా ఇంకా అనేకంగా తరలివెళ్లినట్టు ప్రచారం ఉంది. అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్న కారణంగా సహజసిద్ధంగా ఉండాల్సిన వన్యప్రాణులు ఇలా స్మగ్లర్ల బారినపడుతున్నాయి. దీనిపై అధికారు లు పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేసి వన్యప్రాణులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి దొంగలు దొరికారు

(ఐదో పేజీ తరువాయి)

గంజాయి పట్టుబడింది. సాంకేతికత ఆధారంగా పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా పిండాగుడి గ్రామానికి చెందిన ఆయూబ్‌మాజి.. గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. గజపతి జిల్లా శాంతినగర్ కాలనీకి చెందిన రంజిత్ బర్దన్ అలియాస్ దురబర్దన్ గంజాయి సమకూర్చినట్టు తెలుసుకున్నారు. వీరిద్దరికీ ఒడిశాలో పని చేస్తున్న హోంగార్డు అభిమజ్జి సహకరించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ముగ్గురూ గజపతి జిల్లా అటవీ ప్రాంతం ఉటుక గ్రామం నుంచి గంజాయిని పలాసకు చేర్చి అక్కడ నుంచి ఓ కంటైనర్‌లో తమిళనాడుకు తరలించేందుకు యత్నించారు. ఈక్రమంలో ప్లానింగ్ బెడిసికొట్టగా.. పోలీసులు రెండు వారాలుగా వీరికోసం గాలించి పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని, గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గంజాయి రహిత సమాజ స్థాపనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కేసులో నిందితులను విచారించి.. గంజాయి ఆర్గనైజర్ల వివరాలు తెలుసు కున్నామని త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 56 మంది గంజాయి బాబులు పరారీలో ఉన్నారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేశాం. మరో ముగ్గు రు శ్రీకాకుళం వాసులు. మిగిలిన వారంతా ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణకు చెందినవారే. వారి కోసం గాలిస్తున్నాం. త్వరలో అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఏఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన పాతపట్నం సీఐ వి.రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్‌బాబు, పీసీలు జగన్నాథం, గౌరీశంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

జీడి రైతుకు ఊతం



● పంటకు బీమా వర్తింపు

● ఎకరాకు రూ.1600 కడితే.. రూ.32 వేల పరిహారం

● కూటమి ప్రభుత్వానికి రైతుల కృతజ్ఞతలు

● జిల్లాలో ఐదు లక్షల కుటుంబాలకు మేలు

ఇచ్ఛాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీడి రైతులకు కూటమి ప్రభు త్వం తీపి కబురు చెప్పింది. జీడి పంటకు బీమా పథకం వర్తింపజేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పంటకు నష్టం వాటిల్లితే పరిహారం అందిం చేందుకు ముందుకు వచ్చింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంటల బీమా పథకంలో జీడికి చోటు లేకుండా పోయింది. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం జీడి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అవకాశమిచ్చింది. వాస్తవానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం జీడి పంటను బీమా పథకంలో చేర్చింది. కానీ, జగన్ గద్దెనెక్కిన తరువాత వాణిజ్య పంట, ఆపై లాభసాటి పంటగా భావించి బీమా పథకం నుంచి జీడిని తొలగించారు. దీంతో, గత ఐదేళ్లుగా వాతావరణం అనుకూలించక జీడి పంటకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి రూపాయి రాలేదు. పోనీ బీమాకు అవకాశం ఇచ్చి ఉంటే పరిహారం అయినా దక్కేది. కానీ, అది కూడా లేకుండా చేసింది జగన్ సర్కారు. దీనిపై కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్లడంతో పంటల బీమా పథకంలో జీడిని చేర్చింది. ఇఫ్కోటియా అనే కంపెనీకి బీమా బాధ్యతలు అప్పగించింది. కేవలం రైతు వాటాగా ఎకరాకు రూ.1600 కడితే రూ.32 వేల వరకూ బీమా పరిహారం దక్కే అవకాశముంది. ఈ క్రాప్‌లో తప్పకుండా నమోదై ఉండాలని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

51వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ప్రధాన పంట వరికాగా.. ఆ తరువాత స్థానంలో జీడి, కొబ్బరి నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 51 వేల ఎకరాల్లో జీడి సాగవుతున్నట్టు గణంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా ఉద్దానంలోని వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో 40 వేల ఎకరాల్లో జీడిని రైతులు సాగుచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం సాగవుతోంది. ఈ పంటపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఏటా సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల జీడిపిక్కల దిగుబడి వస్తోంది. పప్పు ఎగుమతులతో వందలాది కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే వ్యయప్రయాసల కోర్చి జీడి సాగుచేస్తున్న రైతులకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు కలగడం లేదు. ఏటా వర్షాభావ పరిస్థితులు, భారీ తుఫాన్లు, వైపరీత్యాల కారణాలతో జీడికి అపార నష్టం కలుగుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేయడంతో జీడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిశోధన కేంద్రం ఏర్పాటయ్యేనా?

వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీడి మద్దతు ధర పెరిగింది. వంద కిలోల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించింది. అంతర్జాతీయంగా జీడి పప్పు ధర పెరగడం కూడా కలిసి వచ్చింది. కానీ, ఏటా ప్రకృతి విపత్తులతో జీడికి అంతులేని నష్టం జరుగుతోంది. ఉత్పత్తి, దిగుబడి గణనీయంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఎకరాకు 5 నుంచి 6 బస్తాల వరకూ దిగుబడి రావాల్సి ఉంది. కానీ, 2 బస్తాలకు మించి రావడం లేదు. మెట్ట తోటల నుంచి ఒక బస్తా దిగుబడిరాగా.. ఇసుక తోటల నుంచి కాస్తా పర్వాలేదు. 2 నుంచి 3 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. అసలు జీడి రైతులకు సాగు సలహాలు, సూచనలు అందడం లేదు. మేలైన జీడి మొక్కల పంపిణీ జరగడం లేదు. అసలు జీడి పరిశోధనలు కూడా జరగడం లేదు. గతంలో వజ్రపుకొత్తూరు మండలంలో జీడి పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరిగాయి. అందుకు నాడు టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు కూడా పూర్తిచేసింది. కానీ, వైసీపీ సర్కారు దానిని బుట్టదాఖలు చేసింది. దీంతో అది మరుగునపడిపోయింది. ఏటా విపత్తులకు తోడు చీడపీడలు ఎదురవుతున్నాయి. దీంతో అది దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికైనా జీడిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

బీమా చేసుకోవాలి..

రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్కోటియా కంపెనీకి బీమా బాధ్యతలు అప్పగించింది. రైతులు ఈ నెల 15లోగా బీమా చేసుకోవాలి. ఒక వేళ పంటలకు నష్టం వాటిల్లితే నేరుగా రైతుల ఖాతాల్లోనే పరిహారం జమ అవుతుంది. జీడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-మాధవీలత, జిల్లా హార్టీకల్చర్ అధికారిణి, శ్రీకాకుళం

శుభ పరిణామం..

జీడి పంటకు పంటల బీమా పథకంలో అవకాశం ఇవ్వడం శుభ పరిణామం. టీడీపీ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మద్దతు ధర కల్పించినా ఏటా విపత్తులతో పంటలకు నష్టం వాటిల్లుతుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి పరిహారం అందలేదు. ప్రభుత్వం పరిహారం అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది.

-దున్న పాపారావు, జీడి రైతు, బూర్జపాడు, ఇచ్ఛాపురం

రుణపడి ఉంటాం..

గత కొన్నేళ్లుగా విపత్తులతో జీడి రైతు చాలా నష్టపోయాడు. పంటలు నాశనం కావడం, మరోవైపు మద్దతు ధర లేక ఇబ్బంది పడ్డాడు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మద్దతు ధర ప్రకటించింది. ఇప్పుడు బీమా పథకంలో చేర్పించింది. ప్రభుత్వానికి జీడి రైతులు రుణపడి ఉంటారు.

-పులకల లక్ష్మయ్య, జీడిరైతు, లక్ష్మీపురం, ఇచ్ఛాపురం

జానపదం కళకళ

● గ్రామాల్లో పెరుగుతున్న ఆదరణ

● చూసేందుకు తరలివస్తున్న ప్రజలు

● ప్రభుత్వం చేయూత ఇవ్వాలంటున్న కళాకారులు

గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ సాక్ష్యాలు జానపదాలు. ఒక తరం నుంచి మరో తరానికి అటు ఆచార, సంప్రదాయాలు, ఇటు పౌరాణిక గాథలను వారసత్వంగా కొనసాగించడంలో జానపదాల పాత్ర ఎనలేనిది. అటువంటి ప్రాచీన జానపదాలు అంతరించిపోతున్న తరుణంలో వాటికి మళ్లీ ఊపిరిపోస్తున్నారు నేటి యువతరం. నేటి ఆధునిక సమాజంలో జానపదాలకు గ్రామాల్లో ఆదరణ పెరుగుతోంది. ఈ కళకు పూర్వ వైభవం తెచ్చేందుకు కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయం. ప్రభుత్వం తమకు మరింత చేయూత అందిస్తే రానున్న రోజుల్లో ఈ కళను మరింత వ్యాప్తి చేస్తామంటున్నారు కళాకారులు.



పలాసపురానికి చెందిన జానపద కళాకారులు విశ్వనాథం (శ్రీకృష్ణుడి వేషధారణ), తదితరులు

కంచిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజంలో పండగలకు కొదవ ఉండదు. సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి ఎన్నో పండగలను హిందువులు ఎంతో వైభవంగా జరుపుకొంటుంటారు. అలాగే, అమ్మవార్ల జాతర్లు, తీర్థాలు నిర్వహిస్తుంటారు. ఇలాంటి సమయాల్లో పూర్వ కాలం గ్రామీణ ప్రాంతాల్లో తోలుబొమ్మలాట, భాగవతాలు, చెక్క భజన, యక్షగానం, కోలాటం, గంగిరెద్దుల ఆట, బుర్రకథ, తప్పెట గుళ్లు, కోయి నృత్యాలు, థింసా నృత్యం, హరికథా గానం, పగటి వేషాలు తదితర ప్రదర్శనలు నిర్వహించేవారు. వీటిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేవారు. అప్పట్లో తమ చుట్టుపక్క గ్రామాల్లో ఎక్కడ ఇలాంటి ప్రదర్శనలు జరిగినా వెళ్లేవారు. అయితే, రాను రాను ఈ కళలకు ఆదరణ తగ్గింది. డీజేలు, టీవీలు, ఆండ్రాయిడ్ ఫోన్లు, సినిమాలు వంటివి అందుబాటులోకి రావడడంతో జానపద కళలను చూసేవారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో నేటి ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా జాతపద కళలు రూపాంతరం చెందాయి. మోడ్రన్ పద్ధతిలో కళాకళారులు ప్రదర్శనలు ఇస్తుండడంతో జానపద కళలకు గ్రామాల్లో మళ్లీ ఆదరణ లభిస్తోంది. భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారిని ఆకట్టుకునేందుకు ప్రతీ గ్రామంలో కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. కోలాటం, చెక్క భజన, తప్పెగుళ్ల వంటి ప్రదర్శనల సమయంలో డీజేలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పాటలకు అనుగుణంగా కళాకారులు ఆడుతున్నారు. అలాగే, యువత ప్రత్యేకంగా వివిధ నాటకాలను ప్రదర్శిస్తున్నారు. వాటిని చూసేందుకు పెద్ద ఎత్తున యువత, మహిళలు తరలివస్తున్నారు. ప్రజల ఆదరణను చూసి కొందరు కళాకారులు కన్నీటిపర్యంతమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఎక్కడ ప్రదర్శనలు ఇచ్చిన వృద్ధులు, కొంతమంది పెద్దలు తప్ప అంతగా ఆదరణ లభించేది కాదని, ఇప్పుడు తమ ప్రదర్శనలకు ఎక్కువ మంది రావడం ఆనందంగా ఉందంటున్నారు. ఉత్తరాంధ్రలో సుమారుగా 200కు పైగా జానపద కళాకారుల కుటుంబాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట మండలం పలాసపురం, జింకిభద్ర, కవిటి మండలంలోని పలు గ్రామాల్లో పలు కుటుంబాలు నేటికీ జానపదాలను నమ్ముకునే జీవనం సాగిస్తున్నాయి. కళలపై మక్కువతో ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి తాము ఈ రంగంలో ఉన్నామని, ప్రభుత్వం చేయూత అందిస్తే రాబోయే తరాలకు ఈ కళను సజీవంగా అందించగలుగుతామని వారు చెబుతున్నారు. జాతర్లు, పండుగలు జరిగినప్పుడు తప్ప ఇతర రోజుల్లో ఎటువంటి పనులు ఉండవని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



కళా జాతరలో ప్రదర్శన ఇస్తున్న పలాసకు చెందిన కళాకారులు కుమార్‌నాయక్ (కుండ ఉన్న వ్యక్తి), తదితరులు

బాగానే ఆదరిస్తున్నారు..

గతంతో పోల్చితే ఇప్పుడు జానపద ప్రదర్శనలను ప్రజలు బాగానే ఆదరిస్తున్నారు. ఇలాగే ఆదరిస్తే తాము మరింత రాణిస్తాం. ప్రభుత్వం కూడా ఆర్థికంగా చేయూత అందిస్తే ఇంకొన్నాళ్లు జానపదాలు బతుకుతాయి.

-బెందాళం విశ్వనాథం, పలాసపురం

ఏళ్ల తరబడి ప్రదర్శనలు ఇస్తున్నా..

కళలపై ఉన్న మక్కువతో కోలాటం, బుర్రకథ చెప్పడం, చెంచు నాటకం వంటివి నేర్చుకున్నాను వాటిని ఏళ్ల తరబడి ప్రదర్శిస్తున్నా. ఈ విధంగా మన సంస్కృతీ, సంప్రదాయాలను తరువాత తరానికి అందిస్తున్నాం. అయినా మేమంటే చిన్నచూపే ఉంది. ప్రభుత్వం గుర్తింపు ఇస్తే గౌరవం లభిస్తుంది.

-కళావతి, పౌరాణిక, జానపద కళాకారిణి, శ్రీకాకుళం



జలుమూరు: శ్రీముఖలింగంలో పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం

వైభవంగా ఏకాదశి పూజలు

● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు, వైష్ణవ దేవాలయాలు

కార్తీక మాసంలో వచ్చే ఏకాదశికి విశిష్టత ఉందని భక్తుల ప్రగాఢ నమ్మకం. మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలతో పాటు వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దీప, ధూప నైవేద్యాలు... అభిషేకాలతో వేంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణ, రామాలయాల్లో పూజలు చేశారు. రోజంతా ఉపవాస దీక్షల్లో ఉన్నారు.



గార: పుష్ప అంకరణలో వేణు గోపాలస్వామి



ఎచ్చెర్ల: అల్లినగరంలో రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో..



టెక్కలి మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం



పలాసరూరల్: మందస వాసుదేవాలయంలో..

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

గార, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ శ్రీకూర్మం పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్స్ పోస్టులతో పాటు నైట్ వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలంటూ డీఎంహెచ్‌వో బి.మీనాక్షికి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్‌వోను కలిసి వినతి పత్రం అందించారు. కమిటీ మాజీ చైర్మన్ మైలాపు ప్రభాకరరావు, టీడీపీ నాయకులు గోర సురేష్, బీసీ గిరి తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయండి

కవిటి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను ఉపాధ్యాయ మిత్రులు హాజరై విజయవంతం చేయాలని యూని యన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు కోరారు. కవిటిలో ఎంఆర్సీ వద్ద ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మండల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సీతానాయుడు పాల్గొన్నారు.

17న జాబ్ మేళా

రణస్థలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మీసాల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి ఫైనాన్స్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన 18-20 ఏళ్ల లోపు మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం 89191 82007, 93470 55910 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

15న గిరి ప్రదక్షిణ

జి.సిగడాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఈ నెల 15న ఎందువ గ్రామంలో త్రైలోక్యేశ్వర క్షేత్రం వద్ద గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు శివాలయం వద్ద గిరిప్రదక్షిణ ప్రారంభమై ఎందువ, నడిమివలస, శేతుబీమవరం, గెడ్డకంచరాం లోని పైడితల్లి అమ్మవారి వనం మీదుగా సుమారు 12 కిలోమీటర్లు జరుగుతుందని అన్నారు. భక్తులందరూ పాల్గొని శివానుగ్రహం పొందాలని కోరారు.

ఆలయ ప్రారంభోత్సవం

సోంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాళభద్ర గ్రామంలో మంగళవారం రామమందిరం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుపాటు బ్రహ్మశ్రీ జోష్యుల కామేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. మహిళలు కలశాలతో సీతారామ సహిత లక్ష్మణుడి విగ్రహాలను ఊరేగింపుగా ఊరేగించారు. అనంతరం అన్నప్రసాద చేపట్టారు.



కలశాలతో మహిళల ఊరేగింపు



వర్క్‌షాపులో పాల్గొన్న ఎమ్మెల్యేలు



వర్క్‌షాప్‌లో సిక్కోలు ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్యేలతో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన అమరావతిలో మంగళవారం వర్క్‌షాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ముఖ్యమంత్రి.. నేరుగా ఎమ్మెల్యేలతో మాట్లాడారు. నియోజకవర్గంలో అమలు చేయాల్సిన ప్రభుత్వ కార్యక్రమాలు.. వ్యవహరించాల్సిన విధానం.. అలాగే ఇతరత్రా విషయాలను నేరుగా ఎమ్మెల్యేలకు సీఎం సవివరంగా చెప్పారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, బెందాళం అశోక్ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న మంత్రి అచ్చెన్న

పల్లె పండగ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనుల ప్రగతిలో నిర్లక్ష్యం చేసే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకానికి సంబంధించి వచ్చే వారం నాటికి 2000 గృహాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కేఆర్ త్రినాథస్వామి, డీపీవో కె.భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జలవనరుల శాఖ ఎస్ఈ సుధాకర్, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో 'యువ ఉత్సవ్-2024'

ఎచ్చెర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువశక్తి భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువ ఉత్సవ్-2024లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. బీఆర్ఏయూ వీసీ రజని మాట్లాడుతూ.. డిజిటల్ విధానం ద్వారా సుస్థిర ప్రగతికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ కె.వెంకట ఉజ్వల్, ఉత్సవ్ కోఆర్డినేటర్ ఎం.అనూరాధ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.తేజ తదితరులు పాల్గొన్నారు. ఏడు కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులను అందజేయడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టీడీపీ నాయకులపై దాడి అమానుషం

జి.సిగడాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులపై దాడి అమానుషమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన జి.సిగడాం టీడీపీ నాయకులు నాయిన సూర్యారావు, వెంకటరావులను ఫోన్‌లో ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం సాగునీటి కోసం జరిగిన కొట్లాటలో వైసీపీ వర్గీయులు చేసిన దాడిలో గాయపడి రాజాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం ఎమ్మెల్యే తనయుడు నడుకుదిటి తేజరాజు, కూటమి నాయకులు కలిశెట్టి సూర్యానారాయణ, కుమరాపు రవికుమార్, పల్లవల్లి రఘురాం, ముప్పిడి సురేష్, బూరాడ వెంకటరమణ, ఇజ్జాడ శ్రీనివాసరావు, పిసిని జగన్నాథంనాయుడు ఉన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కూటమి నాయకులు

సమన్వయంతో తెప్పోత్సవం నిర్వహించాలి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీకూర్మం కూర్మనాథ ఆలయంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం జరిగే తెప్పోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం రాత్రి తన కార్యాలయంలో తెప్పోత్సవం కార్యక్రమాలపై చేపట్టాల్సిన జాగ్రత్తలు చర్యలపై పోలీసు, ఎండోమెంట్, రెవెన్యూ, ఫైర్, ఫిషర్స్ విభాగాల అధికారులతో సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. అవసరమైన బోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో అరసవల్లి ఈవో భద్రాజీ, రూరల్ సీఐ పైడపునాయుడు, శ్రీకూర్మనాథ ఆలయ ఈవో, గార ఎస్ఐ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

ఎస్‌బీఐ ఖాతాదారుల ఆందోళన

గార, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గార ఎస్‌బీఐలో బంగారం తాకట్టు పెట్టిన పలువురు ఖాతాదారులు మంగళవారం ఉదయం బ్యాంకు ఎదుట ఆందోళన చేశారు. తాము తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు ఇంతవరకు ఇవ్వలేదని, తిరిగి ఎప్పుడు ఇస్తారో తెలపాలని కోరారు. బ్యాంకు రికార్డు అసిస్టెంట్ అధికారులు తాకట్టు పెట్టిన సొమ్ములు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ సతీష్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. ఖాతాదారుల ఆందోళన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

పనుల్లో నాణ్యత తప్పనిసరి

జి.సిగడాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో భాగంగా చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ లోకేష్ అన్నారు. మధుపాం, గొబ్బూరు తదితర గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను మంగళవారం పరిశీలించారు. డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి, యూత్‌క్లబ్ ప్రతినిధులు అప్పారావు, ఎస్.కృష్ణారావు, పాల్గొన్నారు.

అపార్ నమోదు తప్పనిసరి

శ్రీకాకుళంరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వివరాలను అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో తప్పనిసరిగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ సూచించారు. పెద్దపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు.

అధిక దిగుబడులు

లావేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ ఎరువులు వాడకం వలన రైతుకు తక్కువ పెట్టుబడి అవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ్ స్వామి, మంగళవారం మండలం బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ వనరులు తయారీ, విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. యూత్‌క్లబ్

ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మంగళవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించినట్టు ఈవో వై.భద్రాజీ తెలిపారు.

మత్స్యకార సహకార సంఘం ఎన్నిక

కవిటి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్నకర్రివాని పాలెం గ్రామానికి చెందిన క్రీకడెడ్ క్రీక్ ప్రాంత మత్స్యకార సహకారసంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా ఎం.పురుషోత్తం, కార్యదర్శిగా ఎస్.రవిరాజు, డైరెక్టర్లుగా హేమరాజు, నరేంద్ర తదితరులు ఉన్నారు.జోగారావు, వై.తాతారావు, ఎం.రామారావు, ఎం.జోగారావును ఉన్నారు.రు ఐదేళ్లపాటు కొనసాగనున్నారని పిషరీష్ డెవలప్‌మెంట్ అధికారి ధర్మరాజు పాత్రో తెలిపారు.

అభివృద్ధికి కృషి చేయాలి

రణస్థలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ప్రత్యేక అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఉద్యోగులే కీలకం

లావేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గ్రామ స్థాయి ఉద్యోగులే కీలకమని ఎంపీడీవో పి.వెంకటరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, వెలుగు సిబ్బందికి జీపీడీపీపై శిక్షణ అందించారు. గ్రామాల్లో కుటుంబాల వారీగా సర్వేలు జరిపి వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవాలన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందితో పాటు సమానంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పలువురు హోంగార్డులు ఈ గ్రీవెన్స్‌డే వేదికగా ఎస్పీకి తమ సమస్యలు విన్నవించుకున్నారు. అలాగే కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.వెంకట అప్పారావు మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు పాలక సోములు కుటుంబానికి ఆర్థిక చేయూతగా వెళ్ళను ఎస్పీ అందజేశారు. జిల్లాలోని హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనం రూ.4.06 లక్షలు అందించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఏవో సీహెచ్ గోపినాథ్, రిజర్వ్ ఎస్ఐలు హరినాథ్, రవి ఉన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

పొందూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐటీఐలు చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కళాశాలలో విలువైన వాచీలెన్సు, కుళాయి ట్యాప్‌లను దొంగతనం చేసిన శ్రీకాకుళం నగరానికి చెందిన పొందూరు అప్పారావు, చింతలపూడి ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

లంచం తీసుకున్న ఏఎస్ఐ సస్పెన్షన్

శ్రీకాకుళంక్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న టెక్కలి అర్బన్ ఏఎస్ఐ టి.నర్సింగరావును సస్పెండ్ చేస్తూ ఎస్పీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ గ్రానైట్ పరిశ్రమ నుంచి స్టోన్ ట్రాలర్ నుంచి ఏఎస్ఐ ఐదువేల రూపాయలు లంచం తీసుకున్నారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు అందడంతో విచారణకు ఆదేశించారు. లంచం తీసుకున్నట్టు తేలడంతో ఏఎస్ఐను సస్పెండ్ చేశారు.

సర్వే నెంబర్లు సరి చేయాలి

ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొళిగాం పంచాయతీ పురుషోత్తపురం ప్రరిధిలోని భూముల సర్వే నెంబర్లను సరి చేయాలని మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు సాడి సహదేవరెడ్డితోపాటు గ్రామస్థులు కోరారు. మంగళవారం గ్రామంలో డీటీ శ్రీహరి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని 96 ఎకరాలకు సంబంధించి సర్వే నెంబర్లు తప్పుగా ఉన్నాయని అధికారుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

పబ్లిక్ నోటీస్

[illegible]

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఈ నెల 8న నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని వారంతా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, జిల్లా బ్యాడ్మింటన్ ఫెడరేషన్ డైరెక్టర్ మధు ఉన్నారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బిర్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల అన్నమయ్య జిల్లాలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి చదువుతున్న బాకి కవిత జిల్లా తరఫున ఆడి సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలవగా, అండర్-19 బాలుర విభాగంలో బెస్ట్ చదువుతున్న బర్ల కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న పరపటి ధర్మారావు సత్తాచాటారు. పీఈటీ ధర్మరాజు, హెచ్ఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

● అలాగే స్థానిక రోటరీ క్లబ్ న్యూజనరేషన్ మంత్ సందర్భంగా సురంగి రాజా మైదానంలో విద్యార్థులకు మంగళవారం అథ్లెటిక్ క్రీడా పోటీలు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

● ఎచ్చెర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గురునానక్ దేవ్ యూనివర్సిటీ (పంజాబ్)లో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ తరఫున పాల్గొన్న ఎల్.జగదీశ్వరి రెండో స్థానంలో నిలిచారు. వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత అభినందించారు. ఇప్పటికే సెమీఫైనల్స్‌లోనూ నిలవడంతో ప్రతిభ చాటారని తెలిపారు. వర్సిటీ అఫ్ అలహాబాద్ క్రీడాకారిణిపై తలపడిన ఈ విద్యార్థిని 21 పాయింట్లు సాధించి రెండో రౌండ్‌కు చేరుకుంది.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి





లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలి

జి.సిగడాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లో వోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆపరేషన్ విద్యుత్‌శాఖ డీఈ పి.యోగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఈ పి.దుర్గాప్రసాద్, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

గోకర్ణపల్లిలో అభివృద్ధి పనులు

పొందూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోకర్ణపల్లి గ్రామంలో రూ.30 లక్షల మండల పరిషత్ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. మాజీ ఎంపీటీసీ శ్రీరంగనాయకులు, కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

ప్రణాళికపై అవగాహన ఉండాలి

గార, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ కమిషనర్ కృష్ణ మోహన్ (తాడేపల్లి) అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, మండల పరిషత్ ఏవో రఘు, ఈవోపీఆర్డీ రాము తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

ఆమదాలవలస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని 13వ వార్డు ఐజీ నాయుడు కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రేపు సీపీఎం ధర్నా

రణస్థలం, నవంబరు 12(ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ధర్నా చేపట్టనున్నట్టు సీపీఎం నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, వెలమల రమణ తెలిపారు. మంగళవారం రణస్థలంలోని సీపీఎం కార్యాలయంలో వారు ప్రజా పోరు గోడ పత్రికను ఆవిష్కరించారు.

నేడు అవగాహన సదస్సు

అరసవల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయస్థానం ఆవరణలో బుధవారం ఉదయం 10.30 గంటలకు వయో వృద్ధుల సంరక్షణ చట్టం-2007 పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ శాఖ ఏడీ కెకవిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులు ఈ సదస్సుకు హాజరు కావాలని కోరారు.

జిల్లా క్రీడాకారుల సత్తా

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ సీనియర్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. గుంటూరులో ఈ నెల 10, 11 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ద్వితీయస్థానంలో నిలిచారు. సింగిల్ స్టిక్ విభాగంలో బి.శ్రీకర్ బంగారు పతకం, సింగిల్ ఫైట్‌లో సాహిత్య సౌమ్య, పవన్, ధనుంజయ్, మహేష్ బంగారు పతకాలు, భవాన్ర్‌ రజతం, హరి, సునీల్ కాంస్య పతకాలు సాధించారు.





ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి
అతికొద్దికాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరు కైనా ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నట్లయితే సదరు విషయాన్ని కూడా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది తక్షణ మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు
ACM : 99854 11514
ACO-1 : 99854 00079
ACO-2 : 99854 11535
Office : 08942 - 281995

జ్యోతిష్యం
కేరళ మహంకాళి మాంత్రిక జ్యోతిష్యం. మీ ఎటువంటి గుప్త కఠిన సమస్యలకు 2 రోజులలో శాశ్వత పరిష్కారం. స్త్రీ పురుష వశీకరణ గ్యారంటీ. వి.డి.భట్, సెల్:6304163239
Ajd:199536

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్స్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు పాఠకులు తగిన విచారణ జరుపుకోవాలని, పరిశీలించుకోవాలని సూచించడమైనది. ప్రకటనదారులు ప్రకటించిన లేదా ప్రకటించిన వస్తువుల నాణ్యతకు ఆంధ్రజ్యోతి సంస్థ ఏ విధమైన బాధ్యత వహించదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా/ఇతరత్రా నమ్మకంగా పెట్టుబడులు పెట్టే వ్యక్తులు మోసాలకు ప్రకటనకర్తలతో జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎలాంటి బాధ్యత వహించదు. ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఓటి

క్లాసిఫైడ్స్ సంప్రదించాల్సిన నెంబర్లు:
శ్రీకాకుళం: 9985465497, నరసన్నపేట: 9985425891
టెక్కలి: 9949607029, పలాస: 9985411524
సోంపేట: 9989281099, రాజాం: 9573179776

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం కార్నర్

దాడి ఘటనలో ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహానికి నిరాకరించారన్న నెపంతో ప్రియురాలి కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన మంగళవారం మంచాలపేటలో సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చంద్రరావు కుమార్తె కొంతకాలంగా చక్రధర్‌ను ప్రేమిస్తోంది. పెళ్లికి సిద్ధమయ్యారు. అయితే ఆమె తండ్రి చక్రధర్‌తో అతనితో పెళ్లి వద్దని నిరాకరించారు. దీనిని మనసులో పెట్టుకుని చక్రధర్ మరికొందరితో కలిసి మంగళవారం చంద్రరావు ఇంటిపైకి చక్రధర్, మరికొందరు దాడి చేయడంతో దాడికి వెళ్లారు. చంద్రరావుతో పాటు దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన సోదరుడు రాజగోపాలరావు, మరదలు సరోజిని గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పారాపురం గ్రామం వద్ద మంగళవారం ఇసుక ట్రాక్టర్ బోల్తాపడింది. అంగూరు వంశధార నదీ తీరం నుంచి ఇసుకతో సీతంపేట వైపు వెళుతుండగా పారాపురం వద్ద అదుపు తప్పి తొట్టి గోతిలో దిగబడి బోల్తా పడింది. అయితే విద్యుత్ స్తంభానికి, తొట్టికి మధ్యలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెళియాపుట్టి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గంగరాజుపురం గ్రామానికి చెందిన సంతోష్ బిస్వాల్ (25) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. స్వగ్రామం నుంచి సుందరాడ గ్రామానికి ట్రాక్టర్‌పై వెళుతుండగా పెద్ద పద్మాపురం వద్ద జారి పడి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.రమేష్‌బాబు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో

టెక్కలినవంబరు12(ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామంలో మంగళవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పింది. రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులతో వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరై ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడే అవకాశం ఉండడంతో ఆటోలో ఉన్న ప్రయాణికులను హుటాహుటిన కిందకు దింపిన గ్రామస్థులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో ఆటో దెబ్బతింది.

యువకుడి అదృశ్యం

జలుమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సారవకోట గ్రామానికి చెందిన తెల్లి వెంకటేష్ (24) కనిపించడం లేదని తల్లి చంద్రావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు. వెంకటేష్ గత కొన్నాళ్లుగా వైజాగ్ వెళ్లి జీవనం సాగించేవాడు. అక్కడ పనులు చేయలేని వెంకటేష్ గతనెల సారవకోట వచ్చి చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గత నెల 31న తిలారు రైల్వే స్టేషన్‌కు వెళ్లిన అతడు అప్పటి నుంచి ఇంటికి రాలేదు. దీంతో తల్లి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

బీసీ, చేనేత సంక్షేమ మంత్రిని కలిసిన ఎంజీఆర్



మంత్రి సవితకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది చేనేత కార్మికులున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఆయనతో పాటు చేనేతకార్మిక సంఘ నాయకులు మంచు కృష్ణారావు తదితరు లున్నారు.

స్త్రీ నిధి ఎండీ హరిప్రసాద్‌ను కలిసిన ఎమ్మెల్యే బగ్గు



హరిప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి ఎండీగా నియమితులైన గురుగుబెల్లి హరిప్రసాద్‌ను మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హరిప్రసాద్ గతంలో నరసన్నపేట యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్‌గా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేశారు. హరిప్రసాద్ మరింత ఉన్నతస్థాయికి చేరాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

15న మెళియాపుట్టిలో 'జన జాతీయ గౌరవ దివస్'



సూచనలిస్తున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

మెళియాపుట్టి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాతంత్ర సమర యోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని ఈనెల 15న 'జన జాతీయ గౌరవ దివస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలన్నారు. మెళియాపుట్టిలో నిర్మాణమవుతున్న ఏకలవ్య పాఠశాల పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డీఈ శిమ్మన్న, ఏఈ శ్రీకాంత్, పీహెచ్‌వో గణేష్ పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి స్థలం మంజూరు



స్థలం మంజూరు పత్రాన్ని జడ్పీటీసీకి ఇస్తున్న తహసీల్దార్

హిరమండలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సుభలయం ఆర్‌ఆర్ కాలనీలో శ్రీమేధా దక్షిణామూర్తి శివాలయం నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ హనుమంతరావు మంజూరు పత్రాన్ని జడ్పీటీసీ బుచ్చిబాబు, చెగువేరా యూత్ సభ్యులకు మంగళవారం అందించారు. వంశధార నిర్వాసితులకు సుభలయ వద్ద కాలనీ ఏర్పాటు చేసి పదేళ్లకు పైగా అయింది. అయితే కాలనీలో హిందూ దేవాలయానికి స్థలం కేటాయించకపోవడంతో గ్రామానికి చెందిన జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, చెగువేరా యూత్ సభ్యులు కలెక్టర్‌కు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావులకు వినతిపత్రాలిచ్చి సమస్యను విన్నవించారు. వారు స్పందించి స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. స్థలం మంజూరుకు కృషి చేసిన నేతలు, యువతను గ్రామస్థులు అభినందించారు.

టెక్కలి డీఎస్పీ పోస్టు భర్తీ అయ్యేనా?

- మూడు నెలలుగా ఖాళీ
- ప్రస్తుతం ఏఎస్పీకే అదనపు బాధ్యతలు



టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రంతో పాటు నియోజకవర్గ ప్రధానకేంద్రమైన టెక్కలి డీఎస్పీ పోస్టు భర్తీలో జాప్యం జరుగుతోంది. మూడు నెలల కిందట డీఎస్పీగా పనిచేసిన డి. బాలచంద్రారెడ్డి బదిలీ కావడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే నాలుగు పర్యాయాలు డీఎస్పీ పోస్టులను రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, నియామకాలు జరిగినా టెక్కలిలో మాత్రం ఇంతవరకు డీఎస్పీ పోస్టింగ్ ఎవరికీ ఇవ్వలేదు. టెక్కలి సబ్ డివిజన్ 2022 జూన్‌లో ప్రారంభం కాగా నాడు సుమారు 11 నెలల పాటు పలాస డీఎస్పీ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఏఎస్పీ పి.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. ఓ పక్క ఆంధ్రా, ఒడిశా సరిహద్దు, మరోపక్క పోర్టు నిర్మాణం వంటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ ప్రాంతానికి డీఎస్పీ పోస్టు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. టెక్కలి డీఎస్పీ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు 13 పోలీస్‌స్టేషన్ల పరిధి లో 300 మంది వరకు సిబ్బంది ఉన్నా అందులో సుమారు 30 మంది సిబ్బంది ఎస్పీ కార్యాలయం, దిశ పోలీస్ స్టేషన్, డీఎస్పీ, సీఐ కార్యాలయాల్లో అదనపు బాధ్యతలకే పరిమితమయ్యారు. టెక్కలి సబ్ డివిజన్ కార్యాలయం పరిధిలో టెక్కలి యూపీఎస్‌తో పాటు నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడా, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రధానంగా ఏవోబీ ఈ డివిజన్‌లో ఉండడంతో వసుంధర, పాత పట్నం చెక్‌పోస్టులు కూడా ఉన్నాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ డివిజన్‌కు డీఎస్పీని త్వరితగతిన నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'నామినేటెడ్ పదవులు' వచ్చేశాయి



చిన్నబాబు రాజేష్ చంద్రశేఖర్ శేషగిరి రవిబాబ్జీ నారాయణమూర్తి భువనేశ్వరరావు

- కాళింగ కార్పొరేషన్‌కు 9 మంది
- అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు ఇద్దరు

శ్రీకాకుళం/ కవిటి/ ఆమదాలవలస/ ఎచ్చెర్ల, టెక్కలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల కేటాయింపు జోరు పెరిగింది. రెండు జాబితాల్లో ఇప్పటికే కొంతమందికి పదవులను కట్టబెడుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా మూడో జాబితాను విడుదల చేసింది. ఇందులో భాగంగా 'కాళింగ కార్పొరేషన్‌కు మెంబర్లను నియమిస్తూ ప్రకటన విడుదలైంది. ఇందులో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులకు ప్రాధాన్యం కల్పించారు. ఇప్పటికే కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన రోణంకి కృష్ణంనాయుడును నియమించగా.. సభ్యులుగా జిల్లాకు చెందిన తొమ్మిది మందికి అవకాశం లభించింది. అలాగే విశాఖ వెస్ట్, గుడివాడ, భీమిలి, విజయనగరం ప్రాంతాలకు చెందిన మరో నలుగురిని ఇందులో సభ్యులుగా చేర్చారు. ఇదిలా ఉండగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు ఇద్దరు డైరెక్టర్లను నియమించారు. ఇదిలా ఉండగా మంత్రి అచ్చెన్నాయుడుకు సన్నిహితంగా ఉన్న టెక్కలి టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరికి చైర్మన్ స్థాయి పదవి కాకుండా డైరెక్టర్ పదవితో సరిపెట్టడంపై ఆ పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

జిల్లాకు చెందిన కళింగ కార్పొరేషన్ సభ్యులు..

పేరు	నియోజకవర్గం	పార్టీ
అన్నెపు భువనేశ్వరరావు	ఎచ్చెర్ల	టీడీపీ
అట్టాడ రవిబాబ్జీ	శ్రీకాకుళం	బీజేపీ
బగాది శేషగిరిరావు	టెక్కలి	టీడీపీ
బర్ల చినబాబు	ఇచ్ఛాపురం	టీడీపీ
బవన్ దుర్యోధన్	పలాస	టీడీపీ
లోళ్ల రాజేష్	ఇచ్ఛాపురం	జనసేన
చౌదరి నారాయణమూర్తి	ఎచ్చెర్ల	టీడీపీ
పేడాడ రామ్మోహన్‌రావు	ఆమదాలవలస	జనసేన
తమ్మినేని చంద్రశేఖర్	ఆమదాలవలస	టీడీపీ

ముగ్గురికి స్థానంపై హర్షాతిరేకాలు



ఈశ్వరరావు, లక్ష్మణ్‌కుమార్, దుర్యోధన

పలాస/వజ్రపుకొత్తూరు/పలాస రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు టీడీపీ నేతలకు కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మందస టీడీపీ సీనియర్ నేత భావన దుర్యోధన, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పలాస మండలం గురుదాసుపురానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, వజ్రపుకొత్తూరు మండల సీనియర్ నాయకుడు పుచ్చ ఈశ్వరరావులను నియమించారు. వీరిని ఎమ్మెల్యే గౌతు శిరీష, టీడీపీ నేతలు అభినందించారు. ఇదిలా ఉండగా పూండి గోవిదంపురం గ్రామానికి చెందిన పుచ్చ ఈశ్వరరావు గతంలో గోవిందపురం ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. అలాగే కుత్తుమ లక్ష్మణ కుమార్ పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వీరి నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తమ నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే శిరీష, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, నారా లోకేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభావంతో పనిచేయాలి

ఎల్.ఎన్.పేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లు సేవాభావంతో పనిచేయాలని ఎంఈవో-2 కె.చంద్రమౌళి అన్నారు. వెలుగు భవనంలో ఏపీఎం రవిరాజ్ అధ్యక్షతన ఉల్లాస్‌లో భాగంగా వలంటీర్లు, వీవోఏలకు మంగళవారం జరిగిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు అంకితభావం, సేవాదృక్పథంతో పనిచేయాన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

జలుమూరు, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) రబీలో ఆరుతడి పంటల్లో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞానం కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. తలతరియాలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆరుతడి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏడీఏ రవీంద్ర భారతి, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్.అనూష, ఎస్.కిరణ్, ఏవో కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగర మత్స్యకార సంఘం ఎన్నిక

పోలాకి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజారాంపురం సాగర తీర మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కోడ తాతారావు, ఉపాధ్యక్షుడిగా మైలపల్లి వాసుదేవరావు, కార్యదర్శిగా కుందు సాయికుమార్, డైరెక్టర్లుగా గుంటు ఎర్రయ్య, పి.ముసలయ్య, ఎస్.రాంబాబు, ఎం.తవిటయ్య, జి.గురుమూర్తి, కె.నూకరాజులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మత్స్యకార సొసైటీ అధికారి ఎస్.ముసలినాయుడు వ్యవహరించగా గ్రామపెద్దలు మైలపల్లి త్రినాథ్, నల్లాన గిరిధర్, వెంకునాయుడు, కొమర ఎర్రయ్య, యు.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

జలుమూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెడితే చర్యలు

- డీఎస్పీ వెంకట అప్పారావు



పలాస, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వి.వెంకట అప్పారావు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతూ ఎదుట వారిని కించపరిచే ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఆదేశించిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పోస్టింగ్‌లు ఉండాలే గాని ఇబ్బందికరంగా పోస్టులు పెడితే వారు ఇబ్బందులు పడతారన్నారు. అలాగే రోడ్లు, పబ్లిక్ స్థలాల్లో మద్యం సేవించడం నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్ టీజింగ్‌లపై దృష్టి పెట్టామని, కళాశాలలు, రోడ్లు, బస్టాండుల్లో ఆకతాయిలు మహిళలు, విద్యార్థినులపై అనుచితంగా వ్యవహరిస్తే తక్షణం చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో సంబరాల పేరిట రాత్రులు రికార్డింగ్ డాన్స్‌లు, డాన్స్ బేబీ డాన్స్‌లు విచ్చలవిడి ప్రదర్శనలు చేస్తున్నారని, వాటిని తక్షణం నిలుపుదల చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు అదనంగా సిబ్బందిని రప్పిస్తున్నామని, చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు సీఐలు డి.మోహనరావు, తిరుపతిరావు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రతిబింబం ఈ బడ్జెట్



మాట్లాడుతున్న కణితి కిరణ్ కుమార్

టెక్కలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రతిబింబంగా కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని టెక్కలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సంపద సృష్టించేందుకు సీఎం ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్య, వైద్యం, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధిలకు నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు. వ్యవసాయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిన మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నేతలు గవరయ్య, కుమారస్వామి, త్రివేణీరావు, తదితరులున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

బడ్జెట్ సమతుల్యంగా ఉందని, సీఎం చంద్రబాబు నేతృత్వంలో అన్నివర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని టీడీపీ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం చిన్ననారాయణపురంలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు ఫ్లెక్సీలకు యాదవ సాధికారిక సమితి కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేతలు దాసరి వాసు, శ్రీనుబాబు, మల్లేషు, తురక కృష్ణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రాధాన్యం

నందిగాం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేయడం హర్షించదగ్గ విషయమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడిపింటి నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రూ.7557 కోట్లు కేటాయించిన నేపథ్యంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన వ్యవసాయబడ్జెట్ అమోఘమని టీడీపీ నాయకులు పి.చంద్రశేఖరరావు, మడపాల మోహనరావు, సలాన కృష్ణారావు అన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం పోటీల్లో కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం చిన్నంనాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో సహస్ర గోల్డ్‌మెడల్, ఏలూరులో జరిగిన పోటీలో దీపక్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. రాజమండ్రిలో జరిగిన పోటీలో జస్వంత్, తిరుపతి కాంస్య పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. హాకీలో పవన్, యశ్వంత్, సాయి, శ్యాముల్, భవానీ ప్రసాద్, బ్యాడ్మింటన్‌లో ప్రేమ్‌చరణ్ ప్రతిభ సాధించారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీ విజేత రట్టి

నందిగాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా బడగాం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రట్టి యూపీ పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. స్క్రీనింగ్ టెస్టులో పది జట్లు ఎంపిక కాగా వారికి పోటీలు నిర్వహించారు. సంతబొమ్మాళి ప్రభుత్వ పాఠశాల ద్వితీయ, కణితూరు పాఠశాల తృతీయ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఎముకల వైద్యుడు కూన పవన్‌కుమార్ సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం టి.కుమారస్వామి, ఎంఈవో జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, హెచ్‌ఎంలు వై.హరిబాబు, కృష్ణారావు, సర్పంచ్ కూన శాంతారావు, మాజీ సర్పంచ్ వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.



బడగాంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అండర్-25 క్రికెట్ జట్టుకు వరప్రసాద్



జలుమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-25 క్రికెట్ జట్టుకు జలుమూరుకు చెందిన సింగుపురం దుర్గా నాగ వరప్రసాద్ ఎంపికయ్యాడు. ఈనెల 17 నుంచి బెంగుళూరులో జరగనున్న అండర్-25 పురుషుల మల్టీడేస్ పి.రామచంద్రారావు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర క్రికెట్ జట్టు తరఫున వరప్రసాద్ పాల్గొనున్నాడు, వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మన్‌గా రాణిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గా నాగ వరప్రసాద్ క్రికెట్ జట్టుకు ఎంపికవడంపై గ్రామ పెద్దలు మునుకోటి దామోదరరావు, కోన దాము తదితరులు అభినందించారు.

డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలి

పాతపట్నం నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, సైబర్ నేర నియంత్రణలో విద్యార్థులు సహకరించాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ పొందాలన్నారు. ప్రిన్సిపాల్ టి.హేమసుందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇసుకదందాపై చర్యలు

నరసన్నపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మడపాంలో ఇసుకదందాకు అధికారులు అడ్డుకట్టు వేశారు. ఈనెల 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఉచితం మాటున ఇసుక దందా' కథనంపై రెవెన్యూ, మైన్స్ అధికారులు స్పందించారు. ట్రాక్టర్ల నుంచి ఎటువంటి బలవంతపు వసూళ్లు చేయరాదని కలెక్షన్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ నోటీసులు జారీ చేశారు. దీంతో మడపాం ఇసుక ర్యాంపుకు వెళ్లే మార్గాన్ని జీడి రైతులు మూసివేశారు. ఈనేపథ్యంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అలాగే బుచ్చిపేట వద్ద అక్రమ నిల్వలపై ఆరా తీశారు. వీఆర్వో, వీఆర్ఏలు నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్టు వేయాలని ఆయన ఆదేశించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

టెక్కలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.రూపావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోస్టర్లను తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి ఆవిష్కరించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు తోటూరు తీరంలో విష్ణుహారతి

వజ్రపుకొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా తోటూరు తీరంలో బుధవారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో విష్ణుహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రేవమ్మ సంబరాలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోకులపాడులో గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో రేవమ్మవారు సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, శాంతిహోమాలు చేపట్టారు. గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

చిన్నారి చదువుకు ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురానికి చెందిన తమ్మినేని సుస్మిత ఉన్నత చదువు కోసం గ్రామ యువకులు రూ.23 వేల బాండును మంగళవారం అందించారు. ఈమె తండ్రి రాజారావు కొన్ని నెలల కిందట కిడ్నీ వ్యాధితో మృతి చెందగా, ఆ కుటుంబ పెద్ద మృతితో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని శ్రీకాళీమాత వాట్సాప్ గ్రూపు వేదికగా విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు హనుమంతు శివకుమార్, హెచ్. అప్పలస్వామి, కె.చలపతిరావు, రేవతి పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయాలి

కొత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 14న చేపడుతున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై కరెంట్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. మహిళలు, పిల్లలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మక అప్పన్న, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కాశీబుగ్గ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఈనెల 14న ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం పలాస కార్యదర్శి ఎన్.గణపతి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా పోస్టర్‌ను స్థానిక కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. నిత్యావసర ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.డిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలి

నరసన్నపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని ఏవో సునీత సూచించారు. మంగళవారం జమ్ము రైతు సేవా కేంద్రంలో వేరుశగన విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం కిలోకు రూ.45 సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందిస్తోందని, వీటిని వినియోగించుకోవాలన్నారు. జమ్ము, తామరాపల్లి గ్రామాల్లో 130.20 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వీఏవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

సంతబొమ్మాళి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు క్రమశిక్షణతో మెలగాలని సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. మంగళవారం సంతబొమ్మాళి కేజీబీవీలో 'సంకల్ప్' కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగించారు. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఈశ్వరరావు, ఉమ తదితరులు పాల్గొన్నారు.